సాక్షి | అమరావతి | ఆదివారం | జనవరి | 31 | 2016

# ఆరు సోలార్ నగరాలను తీర్చిదిద్దుతాం

## గుజరాత్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ హరినారాయణ

**అవనిగడ్డ** : దేశంలో ఆరు నగరాలను సోలార్ సిటీలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టినట్టు గుజరాత్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ టి.హరినారాయణ చెప్పారు. స్థానిక గాంధీక్షేత్రంలో శనివారం జరిగిన గాంధీ జయంతి కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో 3 గిగాబైట్స్ విద్యుత్ సోలార్ ద్వారా ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. 100 గిగాబైట్స్ విద్యుత్‌ని సోలార్ ద్వారా ఉత్పత్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ ఆదేశించారని, అయితే 6 లక్షల మంది నిపుణులు అవసరం కాగా ప్రస్తుతం 20 వేల మందే ఉన్నారన్నారు. తొలిసారిగా గుజరాత్‌లోని గాంధీనగర్‌ను రూఫ్‌టాప్ సిటీగా మార్చి 5 మెగావాట్ల విద్యుత్‌ని ఉత్పత్తి చేస్తున్నామని పేర్కొన్నారు. త్వరలోనే గుంటూరు, ఢిల్లీ, బెంగళూరు, పంజాబ్, అస్సాం నగరాలను సోలార్ సిటీలుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### ఒకటో తేదీ నుంచి ఏఎన్‌యూలో మహిళలకు శిక్షణ

సోలార్ సైంటిస్ట్‌లను తయారు చేసేందుకు గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో ఫిబ్రవరి 1 నుంచి 9 వరకూ దేశవ్యాప్తంగా 20 మంది మహిళా నిపుణులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్టు హరినారాయణ చెప్పారు. గుజరాత్‌లో కాలువల ద్వారా 10 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ని ఉత్పత్తి చేస్తున్నామని, వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ ద్వారా గ్యాస్ ఉత్పత్తి ప్రాజెక్టును అవనిగడ్డ నియోజకవర్గంలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. తొలుత గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సెంట్రల్ విజిలెన్స్ చైర్‌పర్సన్ కె.వి.చౌదరి మాట్లాడుతూ విద్యార్థుల్లో మార్పు తీసుకురావడం ద్వారా అవినీతి రహిత సమాజాన్ని నిర్మించుకోవచ్చన్నారు. ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, స్వచ్ఛభారత్ కార్యకర్తలు పాల్గొన్నారు.



**ప్రసంగిస్తున్న డైరెక్టర్ హరినారాయణ, వేదికపై కె.వి.చౌదరి, మండలి బుద్ధప్రసాద్**

## స్వచ్ఛభారత్‌తో మంచి ఆలోచనలు : కె.వి.చౌదరి

స్వచ్ఛభారత్ అంటే చిత్తుకాగితాలు, చెత్తతీయడమేనని అనుకోవద్దని, మంచి ఆలోచనలు అబ్బడంతోపాటు సమాజంలో ఊహించని మార్పులు వస్తాయని సెంట్రల్ విజిలెన్స్ చైర్‌పర్సన్ కె.వి.చౌదరి పేర్కొన్నారు. గాంధీ క్షేత్రంలో స్వచ్ఛభారత్ కార్యకర్తలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ రూపొందించిన స్వచ్ఛ గాంధేయం పుస్తకాన్ని చౌదరితోపాటు టి.హరినారాయణ దంపతులు కలిసి ఆవిష్కరించారు. ఆర్డీవో సాయిబాబు, డీఎస్పీ ఖాదర్‌బాషా, అవనిగడ్డ జడ్పీటీసీ కొల్లూరి వెంకటేశ్వరరావు, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్(రాజా), చల్లపల్లి, ఘంటసాల, నాగాయలంక, అవనిగడ్డ, భావదేవరపల్లి, దక్షిణ చిరువోలులంక ప్రతినిధులు డాక్టర్ డీఆర్‌కె ప్రసాద్, గొర్రెపాటి సురేష్, ఏవీఎల్ నారాయణ, కొండవీటి ఈశ్వరరావు, మండలి ఉదయభాస్కర్, సనకా పూర్ణచంద్రరావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం కె.వి.చౌదరి, హరినారాయణ దంపతులను ఘనంగా సత్కరించారు.